సాక్షి
పార్వతీపురం మన్యం
బుధవారం । 17 । మే । 2023



వైభవంగా ముగురమ్మల పండగ

బొబ్బిలి మండలంలోని పెంట గ్రామ దేవతలు, ముగ్గురమ్మలైన దేశమ్మ, మెట్టమ్మ, బంగారమ్మ తల్లుల సిరిమానోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. - 8లో



వేర్వేరు సంఘటనల్లో పలువురి మృతి

ఉమ్మడి విజయనగరం జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం జరిగిన వేర్వేరు సంఘటనల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. - 8లో

ఎంజేపీఏపీ ఫలితాల విడుదల

నెల్లిమర్ల: మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్ష ఫలితాలు ప్రకటించినట్టు ఆ పాఠశాలల జిల్లా కన్వీనర్ డాక్టర్ కేజీజి రావు మంగళవారం తెలిపారు. విజయనగరం జిల్లాలోని ఏడు పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు గత నెల 16వ తేదీన పరీక్ష నిర్వహించినట్లు చెప్పారు. ఇందులో వచ్చిన మార్కుల ఆధారంగా 440 సీట్లు భర్తీచేస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులకు సమాచారం అందిస్తున్నామని, ఈ నెల 25వ తేదీలోగా ఆయా పాఠశాలలకు వెళ్లి సీట్లు ఖరారు చేసుకోవాలని సూచించారు.

న్యూస్‌రీల్

జగతపల్లి వ్యూపాయింట్ పరిశీలన



జగతపల్లి వ్యూపాయింట్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి జేసీ విష్ణుచరణ్

సీతంపేట: మండలంలోని జగతపల్లి వ్యూపాయింట్‌ను జిల్లా ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ మంగళవారం సందర్శించారు. 2018 నుంచి వ్యూపాయింట్ నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోవడానికి గల కారణాలు అడిగితెలుసుకున్నారు. ఎంత విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టారన్న అంశంపై సంబంధిత అధికారులు, పరిసర గ్రామాల గిరిజనులను ప్రశ్నించారు. కార్యక్రమంలో పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్, తహసీల్దార్ ఎస్.నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఇంటింటా దోమల నివారణ మందు పిచికారీ



దోమలనివారణ మందు పిచికారీని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి శ్యామ్‌కుమార్

కురుపాం: మన్యంలో మలేరియా నిర్మూలనే లక్ష్యంగా ఇంటింటా దోమలనివారణ మందును వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పిచికారీ చేయిస్తున్నారు. కురుపాం మండలంలోని దురుబిలి, పెళ్లివలస, శివ్వన్నపేట కాలనీల్లో ఏసీఎం ఐదు శాతం ద్రావణాన్ని మంగళవారం పిచికారీ చేయించారు. ఈ ప్రక్రియను జిల్లా మలేరియా అధికారి ఎ.శ్యామ్‌కుమార్, మలేరియా కన్సల్టెంట్ జి.రామచంద్ర, సబ్‌యూనిట్ అధికారి ఎస్.నారాయణరావు పర్యవేక్షించారు. ప్రతీ ఒక్కరూ దోమల నివారణ మందు పిచికారీకి సహకరించాలని కోరారు.

విడిపోయిన ఏనుగుల జంట



పాకుడుభద్ర పరిసరాల్లో సంచరిస్తున్న ఒంటరి ఏనుగు

పాలకొండ రూరల్: ఇటీవల భామిని మండలం కాట్రగడ-బి వద్ద జరిగిన విద్యుత్ ప్రమాదంలో నాలుగు ఏనుగులు మృత్యువాత పడగా, రెండు ఏనుగులు ప్రమాదం నుంచి బయటపడిన విషయం తెలిసిందే. ఇందులో ఒక ఏనుగు (ఆడది) ఒడిశాలోని కాశీనగర్ అడువుల్లోకి వెళ్లిపోగా, మిగిలిన మగ ఏనుగు భామిని మండలం పాకుడుభద్ర-మనుమకొండ పరిసరాల్లో ఒంటరిగా సంచరిస్తున్నట్టు గుర్తించామని పాలకొండ అటవీశాఖాధికారి కె.తవిటినాయుడు మంగళవారం తెలిపారు. సమీప గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏనుగు సంచరిస్తున్న ప్రాంతాలవైపు వెళ్లకూడదన్నారు. ఇదే మండలం తాలాడ పరిసరాల్లో సంచరిస్తున్న మరో నాలుగు ఏనుగుల గుంపు కూడా ఒడిశా అడువుల్లోకి వెళ్లిపోయినట్టు తెలిపారు. అయితే, ఇవి ఏ క్షణమైనా తిరిగి వచ్చే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తతతో మెలగాలన్నారు.

ప్రత్యేక తరగతుల పర్యవేక్షణ

భామిని: పదోతరగతి ఫెయిలైన విద్యార్థులకు భామిని మండలం బత్తిలి జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను డీఈఓ ఎస్.ప్రేమ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. శతశాతం ఉత్తీర్ణత సాధించేలా బోధన సాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. నాడు-నేడు పనులు, ఏపీ మోడల్ స్కూల్‌లో జేవీకే కిట్ల నిల్వ గోదాంను పరిశీలించారు. నులకజోడు ఎంపీయూపీ స్కూల్‌లో నాడు-నేడు పనులు ప్రారంభించకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. ఆయన వెంట ఎంఈఓ ఎ.శ్రీనివాసరావు, ఏపీఓ వై.శంకరరావు, మిస్ సీఓ రామకృష్ణ, సీఆర్పీలు, ఐఈఆర్‌టీలు, టీచర్లు ఉన్నారు.

అభ్యసనా సామర్థ్యాలు పెంపొందేలా బోధన

విజయనగరం పూల్‌బాగ్: విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పెంపొందేలా బోధన సాగించాలని జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వర రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 1998, 2008 డీఎస్సీల ఎంటీఎస్ ఉపాధ్యాయులకు, 2018 డీఎస్సీ ఎస్జీటీలకు విజయనగరం కస్పా హైస్కూల్‌లో జరుగుతున్న వృత్యంతర శిక్షణ తరగతులను డీఈఓ మంగళవారం సందర్శించారు. లెర్న్ ఎ వర్డ్, ఉయ్ లవ్ రీడింగ్, తర్ల్ వంటి కార్యక్రమాలను అమలు చేసి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలన్నారు.

మన్యంలో నిప్పుల వాన



అబ్బబ్బా..
ఎండ కాల్చేస్తోంది...



జనసంచారంలేని పార్వతీపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి



గొడుగే
ఎండకు రక్ష

- జిల్లాలో అగ్నిగుండంలా మారిన వాతావరణం
- ఉదయం 10 గంటల నుంచే ఉష్ణతాపం
- జిల్లాలో 43 డిగ్రీలకు తాకిన ఉష్ణోగ్రతలు
- నిర్మానుష్యంగా మారిన రోడ్లు
- ఎండవేడిమి కారణంగా పెరిగిన విద్యుత్ వినియోగం

పార్వతీపురం టౌన్: భానుడు ఉగ్రరూపం దాల్చాడు. గత నాలుగురోజులుగా నిప్పుల వాన కురిపిస్తున్నాడు. దీంతో పార్వతీపురం మన్యం జిల్లా అగ్నిగుండలా మారింది. ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరగడంతో జిల్లా వాసులు ఆపసోపాలు పడుతున్నారు. అగ్నికర్తిర ప్రారంభమైనప్పటి నుంచి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉష్ణతాపానికి ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గుమ్మం నుంచి కాలుబయట పెట్టలేని పరిస్థితి నెలకొంది. జిల్లాలో వీస్తున్న వేడిగాలులు కంటిపై కునుకులేకుండా చేస్తున్నాయి. జిల్లాలో పలుచోట్ల మంగళవారం 42 నుంచి 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా పార్వతీపురం పట్టణంలో 43.01 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. 15 మండలాల్లోనూ 42 డిగ్రీలు, తకు మించి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వడగాడ్పులతో బస్సులు, బైక్‌లు, ఇతర వాహనాల్లో ప్రయాణించే వారు ఇబ్బందులు పడ్డారు. కొబ్బరి బొండాలు, మజ్జిగ తాగుతూ ఉపశమనం పొందారు.

పెరిగిన విద్యుత్ వినియోగం

ఎండవేడిమికి తాళలేక ఇళ్లకే పరిమితమైన ప్రజలు ఇళ్లల్లో ఫ్యాన్లు, ఎయిర్ కూలర్లు, ఎయిర్ కండిషన్లు ఉపయోగించుకోవడంతో జిల్లాలో విద్యుత్ వినియోగం అమాంతం పెరిగింది. దీంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఫీడర్ బ్రేక్‌లు ఏర్పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. విద్యుత్ శాఖాధికారులు తక్షణమే స్పందిస్తూ విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో గత మూడు నెలలతో పోల్చితే ఈ నెలలో 20 శాతం విద్యుత్ వినియోగం పెరిగినట్టు అధికారులు చెబుతున్నారు.

జాగ్రత్తలే ప్రధానం

ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, ప్రజలందరూ వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ఆ సమయంలో సాధ్యమైనంత వరకు బయటకు రాకుండా ఉండడం మంచిదన్నారు. తప్పనిసరి పరిస్థితిలో బయటకు వచ్చేవారు తెల్లని, వదులుగా ఉండే దుస్తులు ధరించాలని, గొడుగు లేదా టోపీ ధరించి బయటకు వెళ్లాలని సూచించారు. ఉపాధి హామీ పనులకు వెళ్లే వారందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓఆర్ఎస్ కలిపిన నీళ్లు, కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు, నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలన్నారు. వడదెబ్బకు గురైతే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను లేదా వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు వెళ్లి సేవలు పొందాలని సూచిస్తున్నారు.

జిల్లాలో గత మూడు రోజులుగా నమోదైన కనిష్ట-గరిష్ట ఉష్ణోగ్రతలు ఇలా..

మండలం	ఆదివారం	సోమవారం	మంగళవారం
పార్వతీపురం	27-42	28-42	29-43
సీతానగరం	26-42	28-42	26-43
బలిజిపేట	24-41	22-42	24-42
సాలూరు	25-41	23-42	27-42
మక్కువ	24-41	24-41	26-42
పాచిపెంట	25-42	26-42	27-42
కురపాం	25-41	27-42	26-43
గుమ్మలక్ష్మీపురం	27-41	25-42	25-42
జియ్యమ్మవలస	24-41	23-42	26-42
గరుగుబిల్లి	25-41	25-42	26-42
కొమరాడ	26-41	26-42	27-43
పాలకొండ	25-41	26-42	28-43
సీతంపేట	27-41	26-42	28-42
వీరఘట్టం	25-41	25-42	26-42
భామిని	26-41	28-42	27-42

వెలవెలబోయిన చిరువ్యాపారాలు

ఎండ తీవ్రత వ్యాపార రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అధిక ఉష్ణోగ్రతలు కారణంగా సాలూరు, పార్వతీపురం, కురుపాం, పాలకొండ పట్టణాలు, గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా వ్యాపారం చేసుకొనే చిరువ్యాపారులు తమ వ్యాపారాలు సరిగ్గా సాగడం లేదని వాపోతున్నారు. ఎండతీవ్రత తగ్గేంతవరకు వ్యాపారాలు మందకొడిగా సాగుతాయని చెబుతున్నారు.



ఎండధాటికి కొనుగోలుదారులు లేక సాగని చిరువ్యాపారాలు

అప్రమత్తతే ప్రధానం



ఎండ తీవ్రత పెరిగింది. వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండలో తిరగకూడదు. రోజుకు 3 నుంచి 4 లీటర్ల నీరు తాగాలి. కొబ్బరిబొండాలు, మజ్జిగ, ఓఆర్ఎస్, గ్లూకోజ్, నిమ్మరసం వంటి ద్రావణాలు ఎక్కువగా తీసుకోవడం చాలా మంచిది. అత్యవసరవేళ బయటకు వెళ్లేవారు తాగునీరు, గొడుగును వెంట తీసుకెళ్లాలి. తెలుపు రంగు లేదా పలుచటి చేనేత వస్త్రాలు, తలకు టోపీ లేదా రుమాల్ ధరించాలి. బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు తిరగరాదు. శరీరాన్ని డీ హైడ్రేట్ చేసే ఆల్కహాల్, టీ, కాఫీ అతిగా తీసుకోవద్దు.

– డా. బి.జగన్నాథరావు,
జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి,
పార్వతీపుంమన్యం

చివరి గింజవరకు కొనుగోలు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జేసీ విష్ణుచరణ్

పార్వతీపురం: రబీలో రైతులు పండించిన ధాన్యం చివరి గింజవరకు కొనుగోలు చేయాలని పార్వతీపురం ఐటీడీఏ పీఓ, ఇన్‌చార్జి జేసీ సి.విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాల వారీగా ధాన్యం సేకరణ కేంద్రాలు, కొనుగోలు లక్ష్యాలపై సమీక్షించారు. రైతులకు అవసరమైన గోనె సంచులను అందజేయాలన్నారు. రైతులకు ధాన్యం రవాణా డబ్బులు ఎప్పటికప్పుడు చెల్లించాలని, అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధాన్యం సేకరణకు సంబంధించిన సమాచారాన్ని ఇ-ఆఫీసులో పొందుపరచాలన్నారు. మండల వ్యవసాయశాఖ, కోపరేటివ్ సొసైటీ, మార్కెటింగ్ అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని, అప్పుడే లక్ష్యాలను పూర్తి చేయగలమన్నారు. సమావేశాలకు అధికారులు సమగ్రమైన సమాచారంతో హాజరు కావాలన్నారు. రవాణా సౌకర్యం లేని రైతులకు వాహనాలను చేకూర్చి రవాణా జరిగేలా చూడాలన్నారు. రవాణా వాహనాలు సమకూర్చుకున్న రైతులకు రవాణా చార్జీలను వెంటనే అందజేయాలన్నారు. మార్క్‌ఫెడ్ పనితీరు సంతృప్తికరంగా లేదని, వచ్చే సమావేశం నాటికి మెరుగుపరుచుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ నాయక్, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు మధుసూదనరావు, వెంకటేష్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

జలపాతాల అభివృద్ధికి కృషి

- ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి



బెనరాయి జలపాతం పరిశీలిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: సీతంపేట మన్యంలోని జలపాతాల అభివృద్ధికి అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్టు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి తెలిపారు. సున్నపుగెడ్డ, దారిమల్లి, బెనరాయి జలపాతాలను ఆమె మంగళవారం సందర్శించారు. సున్నపుగెడ్డ వద్ద పర్యాటకులు నడవానికి వీలుగా రహదారి సౌకర్యం కల్పిస్తామన్నారు. అవసరమైన చోట కర్రలతో బ్రిడ్జిలు ఏర్పాటుచేస్తామని చెప్పారు. ఎకోటూరిజాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. బెనరాయి జలపాతం వద్ద పర్యాటకులు కిందకు దిగడానికి వీలుగా మెట్లు, డ్రెస్సింగ్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. దారిమల్లి జలపాతం కూడా ఇదే తరహాలో అభివృద్ధి చేస్తామన్నారు. పొల్ల వ్యూపాయింట్ సుందరంగా తీర్చి దిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటకాభివృద్ధి అధికారి నారాయణ రావు, పాలకొండ ఎఫ్ఆర్ఓ తవిటినాయుడు, డీఈ కృష్ణమోహన్, పార్కు మేనేజర్ రాజు పాల్గొన్నారు.

బేస్‌బాల్ పోటీల్లో సత్తా చాటిన బాలికల జట్టు

- ఈ నెల 13 నుంచి 15 వరకు అనంతపురంలో జరిగిన పోటీలు



రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన జిల్లా బాలికల జట్టు

తెర్లాం: రాష్ట్రస్థాయి 5వ సీనియర్ బేస్‌బాల్ పోటీల్లో విజయనగరం ఉమ్మడి జిల్లా బాలికల జట్టు సత్తా చాటింది. అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ బేస్‌బాల్ పోటీల్లో జిల్లాకు చెందిన బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది.

ఈ పోటీల్లో ప్రకాశం జిల్లా ద్వితీయ, చిత్తూరు జిల్లా జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయి. జట్టు సభ్యులను జిల్లా బేస్‌బాల్ అసిసోసియేషన్ కార్యదర్శి, ఉల్లిభద్ర పీడీ బైరెడ్డి శ్రీనివాసరావు, తెర్లాం హైస్కూల్ పీడీ బంగారునాయుడు, కోచ్ రాజేష్ అభినందించారు. మరిన్ని పోటీల్లో పాల్గొని పతకాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

శంకుస్థాపన పనులు... శరవేగంగా!



జాతీయ రహదారి నుంచి యూనివర్సిటీ వరకూ ఆరు లైన్ల అప్రోచ్‌రోడ్డు నిర్మాణ పనులు



కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి కేటాయించిన భూమి

- కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి విశాల ప్రాంగణం
- 561.88 ఎకరాల భూసేకరణ కొలిక్కి
- మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లో 480 మంది రైతుల నుంచి భూసేకరణ
- 444 మంది రైతులకు ఇప్పటివరకూ రూ.31.35 కోట్లు చెల్లింపు
- మౌలిక వసతుల కల్పనకు రూ.23.60 కోట్లను కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
- తాగునీటి కల్పనకు రూ.7 కోట్లు
- రూ.16 కోట్లతో జాతీయ రహదారి నుంచి అప్రోచ్ రోడ్డు నిర్మాణం
- విద్యుత్ పనులకు రూ.60 లక్షల కేటాయింపు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఏపీ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం... విద్యల నగరంగా పేరొందిన ఉమ్మడి విజయనగరం జిల్లాకు మరో మణిహారం కానుంది. పార్వతీపురం మన్యం జిల్లా, విజయనగరం జిల్లాల సరిహద్దులోని మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లో సొంత ప్రాంగణం ఏర్పాటుకు శరవేగంగా రంగం సిద్ధమవుతోంది. తానే స్వయంగా జూన్‌లో వచ్చి శంకుస్థాపన చేస్తానని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి భూమిపూజ చేసిన సందర్భంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ మేరకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. విజయనగరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఇప్పటికే సమీక్షించారు. ఆహ్లాదకరమైన వాతావరణం, సువిశాల భవనాల్లో యూనివర్సిటీ ఏర్పాటుకు వీలుగా 561.88 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఆ భూసేకరణ ప్రక్రియను బొబ్బిలి ఆర్డీఓ శేషశైలజ పర్యవేక్షణలో కొలిక్కి వచ్చింది. రైతులకు పరిహారం చెల్లింపు కూడా పూర్తికావొచ్చింది. మరోవైపు రూ.23.60 కోట్లతో మౌలిక వసతుల కల్పన ప్రక్రియ జోరందుకుంది. మరికొద్ది రోజుల్లోనే భూబదలాయింపునకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేయనున్నట్లు సమాచారం. ఇక కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం పాలకవర్గానిదే ఆలస్యం.

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం 2014 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి 13 కేంద్రీయ విద్యాసంస్థలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో భాగంగా ఉమ్మడి విజయనగరం జిల్లాకు ఏపీ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (సీటీయూఏపీ)ను కేటాయించింది. 2019 వరకూ అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ... భూసేకరణను కూడా పూర్తి చేయలేదు. కొత్తవలస మండలంలోని రెల్లి గ్రామం వద్ద భూమి కేటాయించినప్పటికీ అది ఏమాత్రం భవనాల నిర్మాణానికి అనుకూలంగా లేని పరిస్థితి. పూర్తిగా కొండ ప్రాంతం. పరిసరాల్లో టీడీపీ నాయకుల స్థిరాస్తి వ్యాపారాన్ని పెంచుకోవడానికి తప్ప మరెందుకూ ఉపయోగం లేకుండాపోయింది. తమ పదవీకాలం ముగిసేవరకూ నాటి చంద్రబాబు ప్రభుత్వం తాత్సారం చేసింది. చివరకు సీటీయూఏపీ తరగతులను తప్పనిసరిగా ప్రారంభించాల్సి వచ్చింది. దీంతో విజయనగరం పట్టణ శివారు కొండకరకాం వద్దనున్న ఆంధ్రా విశ్వవిద్యాలయం పీజీ క్యాంపస్ పాత భవనంలోనే 2019 ఆగస్టు 5న తరగతులను ప్రారంభించారు.

అన్నివిధాలా ఆమోదయోగ్యంగా...

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ లక్ష్యం సార్థకమయ్యేలా గిరిజన ప్రాంతంలోనే దీన్ని ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంకల్పించింది. విశాఖపట్నం-రాయగడ జాతీయ రహదారికి సమీపంలో, విశాఖ-హౌరా రైల్వేలైన్‌లోని విజయనగరం, గజపతినగరం, బొబ్బిలి రైల్వేస్టేషన్లకు అందుబాటులో ఉండేలా భూమి కేటాయించింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కూడా సమీపంలోనే ఉంటుంది. మెంటాడ మండలం చినమేడపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో 224.01 ఎకరాలు, దత్తిరాజేరు మండలం మర్రివలస రెవెన్యూ గ్రామ పరిధిలో 337.87 ఎకరాలు మొత్తం 561.88 ఎకరాల భూసేకరణ ప్రక్రియ కొలిక్కి వచ్చింది. మొత్తం 480 మంది రైతులు భూమి నష్టపోయినట్లు అధికారులు గుర్తించారు. వారిలో 444 మందికి గత వారం రోజుల్లోనే రూ.31.35 కోట్లను వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో నేరు పరిహారం జమ చేశారు. మిగిలినవారికి ఒకటీ రెండు రోజుల్లో చెల్లింపు ప్రక్రియ పూర్తికానుంది. ఏవైనా సాంకేతిక కారణాలతో ఎవరికైనా పరిహారం అందకపోతే వెంటనే పరిష్కరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇక వారం పది రోజుల్లో భూమిబదలాయింపు ప్రక్రియ కూడా కొలిక్కిరానుంది. ఇందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేయనున్నట్లు తెలిసింది.

కేంద్ర బృందం సంతృప్తి మేరకే...

సీటీయూఏపీకి కేటాయించిన భూమిని గత ఏడాది పరిశీలించిన కేంద్ర బృందం పూర్తి సంతృప్తిని వ్యక్తం చేసింది. భూమిని సీటీయూఏపీ పాలకవర్గానికి బదలాయించిన తర్వాత భవనాల నిర్మాణమంతా కేంద్ర ప్రజాపనుల విభాగం చేపడుతుంది. అయితే భూమి అప్పగింతకు ముందే రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతులను కల్పించాల్సి ఉంది. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.23.60 కోట్లను గత ఏడాదే విడుదల చేసింది. జాతీయ రహదారి నుంచి సీటీయూఏపీ ప్రాంగణం వరకూ రూ.16 కోట్ల వ్యయంతో వంద అడుగుల వెడల్పున ఆరులైన్ల అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. తాగునీటి సదుపాయం కల్పించేందుకు రూ.7 కోట్లను ఖర్చు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన టెండరు ప్రక్రియ పూర్తయింది. ఇప్పటికే సీటీయూఏపీ భూమి మీదుగానున్న 220 కేవీ విద్యుత్తు టవర్లను తొలగించడానికి, విద్యుత్తు సౌకర్యం కల్పించడానికి దాదాపు రూ.60 లక్షలను కేటాయించింది.

త్వరలోనే భూమి బదలాయింపు...



కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి కేటాయించిన భూ సేకరణ ప్రక్రియ పూర్తి అయ్యింది. మరోవైపు మౌలిక వసతుల కల్పనా చర్యలు వేగవంతం చేశాం. తాగునీటి కల్పనకు సంబంధించిన ప్రక్రియకు సంబంధించిన టెండర్లు పూర్తయ్యాయి. పనులు ప్రారంభించాల్సి ఉంది. విద్యుత్తు శాఖకు సంబంధించిన పనులను వేగవంతం చేస్తాం. భూమి బదలాయింపునకు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు చేశాం. త్వరలోనే రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది.

– నాగలక్ష్మి, విజయనగరం జిల్లా కలెక్టర్

క్లుప్తంగా

ఈ నెలాఖరు వరకు గడువు పొడిగింపు

పార్వతీపురం: ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ కోర్సుకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 31వరకు గడువును పొడిగించినట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సీహెచ్.రాజేంద్ర ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైనవారు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏయూ.ఇడియు.ఇన్‌లో చూడాలని స్పష్టం చేశారు.

పోలీస్ సేవలు భేష్

విజయనగరం క్రైమ్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం కురిసిన భారీ ఈదురుగాలులు, వర్షానికి రోడ్లకు ఇరువైపులా ఉన్నచెట్లు పడిపోవడంతో పోలీసులు రంగంలోకి దిగి విస్తృతమైన సేవలందించి, ప్రజల మెప్పును పొందారు. పోలీస్ గ్రౌండ్స్ పక్కన ఉన్న విజయనగరం గజపతినగరం రాష్ట్ర రహదారిపై చెట్లు పడిపోవడంతో ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎల్.శేషాద్రి ఆధ్వర్యంలో వన్‌టౌన్ ఎస్సై భాస్కరరావు, ఆర్ఎస్సైలు ప్రసాద్, రామకృష్ణ, సిబ్బంది క్షణాల్లో చర్యలు చేపట్టి, రోడ్డుపై వాహనాల రాకపోకలను పునరుద్ధరించి, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు.

ఉపాధ్యాయుడి అవతారమెత్తిన ఎంపీడీఓ

వేపాడ: ఎంపీడీఓ కేఎస్ఎస్ పట్నాయక్ ఉపాధ్యాయుడి అవతారమెత్తి స్థానిక ఆదర్శపాఠశాలలో విద్యార్థులకు మంగళవారం అందించారు. ఆదర్శపాఠశాలలో పదోతరగతి ఫెయిలైన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను కలెక్టర్ ఆదేశాల మేరకు సందర్శించిన ఆయన గణితం బోధించారు. విద్యార్థుల అనుమానాలు నివృత్తి చేశారు. సప్లిమెంటరీ పరీక్షల్లో బాగా రాసి శతశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు

విజయనగరం ఫోర్ట్: అకాల వర్షం, భారీ ఈదురు గాలుల కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో చెట్లు పడిపోవడంతో విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయని విద్యుత్‌శాఖ ఈఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. 15 విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగిపోయాయని, 18 పోల్స్ దెబ్బతిన్నాయని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ మేరకు 250 మంది విద్యుత్ సిబ్బందితో పనులు చేపట్టినట్లు చెప్పారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సామగ్రి చోరీ

బాడంగి: మండలంలోని గజరాయునివలసలో 25 కేవీ త్రిఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయినట్టు విద్యుత్ శాఖ ఏఈ టి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైర్ వైండింగ్ లేకపోవడంతో అందులోని కరెంటు ఆయిల్, సిల్వర్ వైర్ మరికొంత సామగ్రి దొంగలించుకుపోయినట్టు గుర్తించామని తెలిపారు. గుర్తించిన సామగ్రి విలువ సుమారు రూ.3లక్షల వరకు ఉంటుందని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. అందిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జయంత్ దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజన యువతి ఆత్మహత్య

గుమ్మలక్ష్మీపురం: తల్లిదండ్రులు మందలించారన్న మనస్తాపంతో ఓ గిరిజన యువతి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎల్విన్‌పేట ఎస్ఐ షణ్ముఖరావు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికొండ పంచాయతీ ఒడ్రుబంగి గ్రామానికి చెందిన మండంగి సుజాత (19) అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని ప్రేమిస్తోంది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు యువతిని మందలించారు. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని మృతిచెందింది.

అన్నదమ్ముల కొట్లాట

పార్వతీపురం: తాగునీరు పట్టుకుంటున్న సమయంలో అన్నదమ్ముల నడుమ గొడవ జరిగింది. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలం చినబొండపల్లి గ్రామంలో ఇంటిముందున్న కుళాయి నీరు పట్టుకుంటున్న సమయంలో అన్నయ్య సాంబశివరావును తమ్ముడు సంచాన శంకరరావు అన్ని నీళ్లు నువ్వే పట్టుకుంటున్నావు. మాకు ఒక బిందెకు అయినా నీరు ఇవ్వవా అని ప్రశ్నించాడు. అంతలో అన్నయ్య సాంబశివరావు, శంకరరావును పీకపట్టుకుని కొట్టాడు. అంతటితో ఆగకుండా సాంబశివరావు కుమారుడు గౌరీశంకరరావు వచ్చి కర్రతో కొట్టాడు. దీంతో పలుచోట్ల శంకరరావుకు గాయాలయ్యాయి. దీంతో స్థానికులు ఆటోలో చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు



డిప్యూటీ స్పీకర్ కోలగట్లవీరభద్రస్వామి సమక్షంలో పార్టీలో చేరిన పతివాడ రమణ మూర్తి తదితరులు

- ఏపీ శాసనసభ ఉపసభాపతి కోలగట్ల
- టీడీపీ నుంచి వైసీపీలోకి చేరికలు
- సాదరంగా ఆహ్వానించిన కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: టీడీపీ పని అయిపోయిందని, వచ్చే ఎన్నికల తర్వాత ఇక ఆ పార్టీకి మనుగడే ఉండదని ఏపీ శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు అని చెప్పారు. తమ ప్రభుత్వ పనితీరు, పార్టీ విధివిధానాలు నచ్చి, అనేకమంది పార్టీలో చేరడం శుభపరిణామంగా పేర్కొన్నారు. నూతనంగా పార్టీలో చేరిన వారందరికీ మనస్ఫూర్తిగా వైఎస్సార్‌సీపీ కుటుంబంలోకి ఆహ్వానం పలుకుతున్నామన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక 47వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పతివాడ రమణమూర్తితో పాటు కేఎల్ పురానికి చెందిన పలువురు నాయకులు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి కోలగట్ల పార్టీ కండువాలు కప్పి, సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డిని పాలనను ఆదరిస్తూ, ఆమోదిస్తూ అనేక రూపాల్లో ప్రజలంతా మద్దతు తెలుపుతున్నారన్నారు. అటు రాష్ట్రంతోపాటు, ఇటు విజయనగరం నియోజకవర్గంలో అవినీతిరహితంగా, పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధిని అందిస్తున్నామని వివరించారు. అందుకే ఇతర పార్టీల నేతలంతా వైఎస్ఆర్ సీపీతో కలిసి నడిచేందుకు సిద్ధపడుతున్నారన్నారు.

అందుబాటులో ఉండని అశోక్ గజపతి

ప్రజలకే కాదు..టీడీపీ కార్యకర్తలు, నాయకులకు కూడా కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతి రాజు అందుబాటులో ఉండరని కోలగట్ల విమర్శించారు. ఆయన ప్రజల్లోకి వచ్చారంటే ఎన్నికలు వస్తున్నాయని సంకేతమన్నారు. పార్టీలో చేరుతున్న పతివాడ రమణమూర్తి కుటుంబంతో ఎన్నో ఏళ్లుగా తనకు అనుబంధం ఉందని గుర్తు చేశారు. ఆయన సేవాభావానికి తాము ఎప్పుడూ అండగా నిలుస్తామని మాట ఇచ్చారు. వైఎస్సార్‌సీపీని నమ్ముకుని వచ్చిన వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు. దశాబ్దాల తరబడి కేఎల్‌పురంలో ఉన్న నీటి సమస్యకు త్వరలోనే ముగింపు లభిస్తుందని, సుమారు రూ.2కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న మంచినీటి పథకం వచ్చే అక్టోబరు నాటికి అందుబాటులోకి వస్తుందని చెప్పారు.

ప్రభుత్వ విధానాలు నచ్చి పార్టీలో చేరిక

ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీలో చేరిన పతివాడ రమణమూర్తి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో డివిజన్ అధ్యక్షుడిగా ఉన్నప్పటికీ ప్రజల కోసం ఏ పనీ చేయలేని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వ విధివిధానాలు, నియోజకవర్గ శాసనసభ్యుడు కోలగట్ల వీరభద్రస్వామి పనితీరు నచ్చి వైఎస్సార్‌సీపీలోకి అనుచరగణంతో చేరుతున్నట్లు ప్రకటించారు. పార్టీలో చేరిన వారిలో మండల గోవిందరావు, పి.రాజేష్, కొర్ని కిరణ్‌కుమార్, పెదగాడి వరుణ్‌కుమార్, కోలా నారాయణరావు, శింగంశెట్టి రాజేశ్వరరావు, చిక్కాల తారకేశ్వరరావు, వద్దమాని సన్యాసిరావు, భోగి కిరణ్‌కుమార్, రాంబాబు, రావాడ కిశోర్‌కుమార్, టేకి కృష్ణ, చందక పూడినాయుడు, జి.కిరణ్ కుమార్, అశోక్ ఆచార్యులు, లింగం కుమార్ తదితరులు ఉన్నారు.

సంక్షేమం అమలులో చరిత్ర

- అర్హత కలిగిన వారందరికీ పథకాలు
- గడపగడపకు మన ప్రభుత్వంలో జెడ్పీ చైర్మన్, ఎంపీ



ఆకులపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: దేశ చరిత్రలో చిరకాలం నిలిచిపోయే విధంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లు అన్నారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో గల ఆకులపేట గ్రామంలో మంగళవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. ఆ ఇంట్లో ఎంత మంది లబ్ధిదారులు ఉన్నారు, నాలుగేళ్లలో ఏఏ పథకాలు వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయో వారికి తెలియపరిచారు. పథకాల మంజూరులో గాని, తీసుకున్నప్పుడు ఎవరికైనా ఒక్క రూపాయి లంచం ఇచ్చారా అని ప్రశ్నించారు. ఎవరికీ ఒక్క రూపాయి కూడా లంచం ఇవ్వలేదని లబ్ధిదారులు బదులిచ్చారు.

98 శాతం హామీల అమలు

అంతకుముందు వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో, మేనిఫెస్టోలో పొందు పరిచిన హామీల్లో 98 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు తీసుకొచ్చి పారదర్శక పరిపాలన సాగిస్తున్నారన్నారు. అర్హత ఉండి ఇంకా సంక్షేమ పథకాలు అందుకోని వారెవరైనా ఉంటే గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, గిరిడ రాందాసు, పతివాడ రాజారావు, మీసాల సాయి, మీసాల సత్యనారాయణ, కొసిరెడ్డి రమణ, వలిరెడ్డి లక్ష్మణ, ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, తహసీల్దార్ ఎం.సురేష్, వెలుగు ఏపీఎం ఎంవీ రాజశేఖర్, మండల ఇంజినీరింగ్ అధికారి డి.రమేష్, మేజర్ పంచాయతీ అధికారి ఝాన్సీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అందరూ ఉత్తీర్ణులు కావాలి

- ఇంటర్‌మీడియట్ ప్రత్యేక తరగతులపై కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి ఎస్

విజయనగరం అర్బన్: ఇటీవల జరిగిన ఇంటర్‌మీడియట్ పరీక్షల్లో ఫెయిల్ అయిన ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు క్రమం తప్పకుండా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, అత్యంత శ్రద్ధ వహించి అందరూ పాస్ అయ్యేలా కృషి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ విద్యాశాఖ పరిధి అధికారులను ఆదేశించారు. విద్యార్థుల్లో మరింత ఉత్సాహం నింపి ఈ నెల 24 నుంచి జరిగే సప్లిమెంటరీ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా వృత్తి విద్యా అధికారి, గురుకులాల జిల్లా కో–ఆర్డినేటర్, ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపాల్, బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సమన్వయ అధికారులతో ఆమె తన చాంబర్లో మంగళవారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. మెరుగైన ఫలితాలు సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలను పేర్కొంటూ పలు సూచనలు చేశారు. అన్ని రకాల వసతులను సమకూరుస్తూ సబ్జెక్ట్ నిపుణుల చేత ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ వారిలో విశ్వాసం నింపాలని సూచించారు. దూరప్రాంతాల్లో ఉన్న విద్యార్థులు వారికి సమీపంలో ఉన్న స్టడీ కేంద్రాలను వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెసిడెన్షియల్ కమ్ కాలేజీస్ ఉన్నచోట అస్సలు ఫెయిల్ కావడానికి వీలులేదని..ఉత్తమ ర్యాంకులు సాధించేలా శ్రద్ధ వహించాలని చెప్పారు. తరగతులతోపాటు విద్యార్థులతో ఆటలు ఆడించాలని సూచించారు. అందరూ సమన్వయంగా కృషి చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయా కళాశాల్లో మౌలిక వసతులు, సదుపాయాలపై ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి లింగేశ్వరరెడ్డి, జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి సురేష్ కుమార్, గురుకులాల జిల్లా కో–ఆర్డినేటర్ చంద్రావతి, తాటిపూడి ఏపీఆర్‌జేసీ కళాశాల ప్రిన్సిపాల్ శారదా బాయ్ తదితరులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



ప్రత్యేక పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావి చెట్ల వద్ద దీపారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి, తరించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ. కేఎల్.సుధారాణి పర్యవేక్షించారు.

వైభవంగా ముగురమ్మల పండగ

- భక్తుల ఆనందోత్సాహాల మధ్య గ్రామదేవతల సిరిమానోత్సవం



సిరిమానుకు కొబ్బరి కాయ కొడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



సిరిమానుపై పూజారిని సిద్ధం చేస్తున్న దృశ్యం



సిరిమాను ప్రారంభ కార్యక్రమానికి హాజరైన భక్తులు



పుర వీధుల్లో ఊరేగుతున్న సిరిమాను

బొబ్బిలి: మండలంలోని పెంట గ్రామ దేవతలు, ముగ్గురమ్మలైన దేశమ్మ, మెట్టమ్మ, బంగారమ్మ తల్లుల సిరిమానోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.మంగళవారం జరిగిన సిరిమానోత్సవానికి బొబ్బిలి చుట్టుపక్కల గ్రామాలతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గ్రామం నుంచి సిరిమాను పూజారిని సిరిమాను ఉండే ఆలయం వద్దకు మేళతాళాలతో భక్తులు తోడ్కొని వచ్చారు. మధ్యాహ్నం 3.45 గంటలకు నగిరేశ్వర ఆలయం వద్ద పూజారి పువ్వల సత్తియ్య సిరిమానును అధిరోహించారు. నగిరేశ్వర స్వామి ఆలయం వద్ద పూజారిని సిరిమానుపై అధిష్టింప చేశారు. సిరిమానును అరటిగెలలు, పసుపు కుంకుమలతో అలంకరించారు. అక్కడి నుంచి భక్తుల జయజయధ్వానాల మధ్య సిరిమాను కదిలింది. అంతకు ముందు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు తదితరులు సిరిమాను వద్ద కొబ్బరికాయ కొట్టి పూజలు చేసి, అమ్మవార్లను కొలిచారు. అక్కడి నుంచి సిరిమాను పెంట గ్రామ పురవీధుల్లో ఊరేగింది. మధ్యలో పలు చోట్ల భక్తులకు పూజారి సత్తియ్య ఆశీర్వచనాలు అందజేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సిరిమానోత్సవం సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, పలు విచిత్ర వేషధారణలు ప్రజలను అలరించాయి. స్టేజి ప్రదర్శనలతో భక్తులను కళాకారులు ఆకట్టుకున్నారు. స్థానిక యువత డప్పుల ముందు వేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. సీఐ ఎం నాగేశ్వర రావు తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల తాకిడి ఎక్కువ కావడం వల్ల గ్రామంలోకి కార్లు, ద్విచక్రవాహనాలు ప్రవేశించిన సమయంలో రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయింది.దీంతో పోలీసులు తగు చర్యలు తీసుకుని సిరిమాను తిరిగే సమయానికి వచ్చే వాహనాలను గ్రామం బయట నిలిపివేయడంతో తరువాత ట్రాఫిక్ సమస్య సద్దుమణిగింది. గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు తీసుకున్న చొరవతో పెంట గ్రామంలో సిరిమానోత్సవం వైభవంగా ముగిసింది.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 480.00
విజయనగరం	రూ. 484.00
శ్రీకాకుళం	రూ. 484.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,800–00
బంగారం(22సి. 10గ్రా.)	56,650–00
వెండి (కిలో)	78,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹142	₹254	₹ 264

వేర్వేరు సంఘటనల్లో పలువురి మృతి

ఉమ్మడి విజయనగరం జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం జరిగిన వేర్వేరు సంఘటనల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఆయా సంఘటనలపై మృతుల బంధువులు, పోలీసులు, స్థానికులు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. – సాక్షి నెట్‌వర్క్

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



సీతంపేట: మృతి చెందిన అభిషేక్

సీతంపేట: మండలంలోని చిన్నబగ్గ గ్రామానికి చెందిన పసుపురెడ్డి అభిషేక్(19) సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. తన స్వగ్రామమైన చిన్నబగ్గ నుంచి కొత్తూరు వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మార్గమధ్యంలో బడిగాం సమీపంలో వాహనం అదుపు తప్పడంతో రోడ్డుపై పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108లో ప్రాంతీయ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. అభిషేక్ గత సంవత్సరం సీతంపేట ప్రభుత్వ ఐటీఐలో చదువు పూర్తి చేసి ఉద్యోగ వేటలో ఉన్నాడు.

హోంగార్డు హఠాన్మరణం



వంగర: మృతిచెందిన ప్రకాశం

వంగర: మండల పరిధి సంగాం గ్రామానికి చెందిన వెలగాడ ప్రకాశం(52) వంగర పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తుండగా శ్రీహరిపురం గ్రామంలోని ఉపాధిహామీ చెరువు వద్ద బందోబస్తు కోసం వెళ్లాడు. మధ్యాహ్నం 3గంటల సమయంలో సంగాంలోని ఇంటికి చేరుకుని గ్లాసుతో నీళ్లు తాగి సేదతీరుతున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయి మృతిచెందాడు. మృతుడికి భార్య రోజాతో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

పాము కాటుతో బాలుడు..

గుర్ల: మండలంలోని చోడవరంలో పాము కాటుకు గురై గరివిడి మండలం వెదుళ్లవలసకు చెందిన అల్లు చరణ్ (11) మృతిచెందాడు. చోడవరంలోని తాతగారింటికి పది రోజుల కిత్రం చరణ్ వచ్చాడు. స్నేహితులతో కలిసి ఇంటి దగ్గరలోని కళ్లాల్లో అడుతుండగా దగ్గరలో ఉన్న తాటి చెట్లలో నుంచి పాము వచ్చి కాటు వేసింది. విషయం తెలుసుకున్న స్థానికులు ఆటోలో ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది.

చెరువులో పడి వృద్ధుడు..

భోగాపురం: మండల కేంద్రంలోని సింగాల చెరువులో పడి గుర్తు తెలియని వృద్ధుడు(50) మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు చెరువు వద్దకు చేరుకుని మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి పంచనామా నిర్వహించారు. ఈ సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..



గంట్యాడ: వరలక్ష్మి మృతదేహం

గంట్యాడ: మండలంలోని మధుపాడ గ్రామానికి చెందిన యర్రాపు వరలక్ష్మి(49) ఈనెల 5వతేదీన పాముకాటుకు గురవడంతో విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది.

పిడుగుపడి వ్యక్తి



జామి: అప్పారావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్సై

జామి: మండలంలోని కె.భీమసింగి గ్రామానికి చెందిన పొంద్రంకి అప్పారావు(40) పిడుగుపడి మృతిచెందాడు. పశువులను పొలంలోకి తీసుకుని వెళ్లగా ఆ సమయంలో వర్షంతో పాటు పిడుగు పడడంతో మృతిచెందాడు. మృతునికి భార్య కొండమ్మ, కుమారుడు నవీన్ ఉన్నారు.

పరుగు పందెంలో ఆగిన ఊపిరి



వీరఘట్టం: దర్రు రాజేష్

వీరఘట్టం: మండలంలోని ఎం.రాజపురం గ్రామానికి చెందిన దర్రు రాజేష్(21) పరుగు పందెంలో ఊపిరి వదిలాడు. సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ ఉద్యోగం కోసం మంగళవారం అనకాపల్లిలో నిర్వహించిన పరుగు పందెంలో రాజేష్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే అక్కడ ఉన్నవారు 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

లారీ క్లీనర్..

దత్తిరాజేరు; మండలంలోని చౌదంతివలస వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొనడంతో క్లీనర్ మృతి చెందినట్లు ఇన్‌చార్జ్ ఎస్సై శిరిష మంగళవారం రాత్రి తెలిపారు. రామభద్రపురం నుంచి పెదమానాపురం వైపు వెళ్తున్న లారీ జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో క్లీనర్ మృతి చెందాడని మృతదేహాన్ని గజపతి నగరం సామాజిక ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.